# ముద్దుపేరు

రచయిత:
డి. వీరరాఘవరావు

వాళ్ల ఆవిడకి "నూర్జహాన్" అనే ముద్దుపేరు పెట్టుకున్నాడు. ఎంచేతంటే మేహరున్నీసాకి ఏవిషయంలోనూ తీసిపోదు. కాని అతనిస్నేహితులకి అతనలా పిలవడం యిష్టంలేదు. రోజూ అతన్ని తిడుతూ వుండేవారు. ఒకనాడు వాళ్లతోటి దెబ్బలాడేడు. "మీరంతా యీర్ష్యచేత అలాగంటున్నారు. మీకెవరికేనా అందమైనపెళ్ళాం వుంటేకాదూ? ఖర్మంజాలక నాకులభిస్తే ముద్దుపేరుపెట్టుకుంటే తప్పొచ్చిందా!"

"క్రొత్తగా కాపరానికి వచ్చిందికాదూ! కళ్ళునెత్తిమీదికివచ్చేయి. గాలిలో మేడలు కడుతున్నావు. ఆ అమ్మాయినికూడా మోసగిస్తున్నావు. జీవితంలో ఒక ఆడదాన్ని చూసేవు. సౌందర్యదేవత అవతరించింది అనుకుంటున్నావు" అని రోజూ వేళాకోళంచేసేవారు. ఋజువుపరచడానికి అందమైన స్త్రీలఫోటోలు పట్టుకొచ్చి అతనికి చూపించేవారు. తన "నూర్జహాన్" నూర్జహానే! అతనిమనస్సు మార్చలేకపోయేరు. వాళ్ళంతా యితని మూర్ఖత్వంచూసి ఆశ్చర్యపోయేవారు. అప్పటినుంచీ మళ్లీ యీవిషయం యెవళ్లూ యెత్తుకోలేరు.

"నాకీపేరిష్టంగాలేదు. అమ్మా నాన్నా పెట్టిన అసలుపేరుమానేసి యీపేరేమిటి?" అని వాళ్ల ఆవిడ మొట్టమొదట దెబ్బలాడేది.

"హాస్యంకాదు. నిన్ను 'నూర్జహాన్' అని యెందుకు పిలుస్తున్నానో నీకు తెలియదు. నీవల్ల నా యీ జీవితాంధకారంలో వెలుతురుకలిగింది."

నూర్జహాన్ నవ్వింది. "మీ ప్రేమను తెలియజేయడానికి గొప్పపేరు వెతికేరు. కాని మీరునన్ను వెర్రిదాన్నిగా భావిస్తున్నారేమో? ఇవన్నీ ముఖస్తుతిమాటలని తెలీదూ? పైకిలాగని లోపలింకోలాగ తలుస్తున్నారని తెలీదా?

"బాగానేవుంది. నామాటల్లోనీకు నమ్మకం లేకపోతే రొమ్ముచీల్చి చూపిస్తాను."

"చాల్లెండి. గుండెలు చీల్చుకుచూపించేఅంత ధైర్యంవుంటే అక్కడ అన్నివెంట్రుకలుండనే వుండవు."

* * *

కొన్నాళ్ళకి వాళ్ళఆవిడకూడా ఒప్పుకోక తప్పిందికాదు. తన్ను మనస్ఫూర్తిగానే ముద్దుపేరుతో పిలుస్తున్నాడని తెలుసుకుంది. తనంత అందగత్తెనా అని ఆవిడకీ అనుమానమే. అప్పుడప్పుడు ఆయనతోటి "మీమనస్సు కెలాతోచిందోగాని, మీస్నేహితులెవ్వరూ ఒప్పుకోరే!" అని అనేది.

"సూర్యప్రభ"
(సచిత్ర మాసపత్రిక)
విడి సంచిక రు 0—2—0
సంవత్సర చందా రు 0—12—0
ఏజంట్లు లేనిఊరులో ఏజంట్లు కావలెను:
వివరములకు :—
మేనేజరు : సూర్యప్రభ,
53, గోవిందప్పనాయకవీధి, జి. టి., మద్రాసు,

* "శ్రీవిస్ అమ్మ" తలనూనె శ్రేష్ఠమయినది. *

అతనిదృష్టిలో, ఆవిడసౌందర్యం రోజురోజూ క్రొత్తక్రొత్త హావభావ విలాసాలతో వృద్ధిపొందుతున్నట్లు కనిపించేది. ఆవిడని "నూర్జహాన్" అని పిలిచేటప్పుడు అతనికున్నంత ఆనందం యీ ప్రపంచంలో యెవ్వరికీవుండదని నా అభిప్రాయం.

ఒకనాడు సాయంత్రం అతను యింటికివచ్చేటప్పటికి "నూర్జహాన్" మొఖం వేలవేసుకు కూర్చుంది. ప్రతిరోజూలాగ చిరునవ్వుతో అతనికి స్వాగతం యివ్వలేదు. అటువంటప్పుడు అతనిమనస్సు యెలాగుంటుందో?

"ఏం? అలాగున్నావు?"

"ఊరికేనే?"

"కారణం?"

"తెలీదు."

"ఒంటే?"

"ఒంట్లో బాగాలేదు."

"కోపంవచ్చిందా?"

"కోపంరావడానికేదీ! మీరీవాళ ఆలశ్యంగానే వచ్చేరు."

"కొంచెంపని యెక్కువైంది యీవాళ... మధ్యాహ్నం ఏంచేసేవు?"

"ఏమీలేదు. ఊరికేకూర్చున్నాను. శంకరం గారువస్తే మాట్లాడుతూ కూర్చున్నాను."

"శంకరంవచ్చేడా! ఎప్పుడు?"

"మధ్యాహ్నం."

"వచ్చి?"

చాలాసేపు కూర్చున్నాడు. మీరురావడం ఆలశ్యంఅయితే వెళ్లిపోయేరు...

"............"

"............"

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏమీలేదు"

"శంకరాన్ని గురించి ఆలోచించడంలేమూ?"

"అవును. మీరిద్దరూ స్నేహితులైనప్పటికీ, మీఆలోచనలు తేడాగావున్నాయని, మీకొకలాగా తోస్తే అతనికొకలాగ తోస్తుంది.

"ఏవిషయంలో కనిపెట్టేవు?"

"ఏమో! నాకలాతోస్తూంది. ఆయనెప్పుడూ నన్ను "నూర్జహాన్" అనిపిలవక నాపేరెట్టే పిలుస్తాడు"

"అదాసంగతి. అంచేతా యింత వుదాసీనంగావున్నావు."

"గొప్పవారే! శంకరంతో నాకేంసంబంధం? అతను నన్ను "నూర్జహాన్" అనిపిలుస్తే ఒచ్చేదేముంది పిలవకపోతే పోయేదేముంది"

"వాడికేం తెలుసు నీసంగతి!"

"చాల్లెండి"

.............

యధాప్రకారం రోజులు గడిచిపోతున్నాయి పూర్వంవున్న ఆచిరునవ్వు, ఆచలాకీ, "నూర్జహాన్"లో సన్నగిలేయి. ఆయనతో అంత చనువుగావుండేది కాదు. ఈ పరివర్తనకి కారణంఏమిటో?

ఆ వేళ సాయంత్రం అతనుఇంటికి వచ్చేటప్పటికి గదిలో శంకరంమాట వినిపించింది.

Printed by V. Kuppuswamy chetty at Bharatamata press, 39, Anderson Street, G.T. Madras.
Edited and Published by A. N. Raghavachar, No: 32, Krishnappa Naick Tank St., G.T., Madras.